

కోనసీమ జిల్లాలో కుంభవృష్టి వర్షం కురిసింది. దాంతో జిల్లా పరిధిలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. రికార్డు స్థాయిలోనే కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం అనూహ్యంగా నమోదైంది. విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బుధవారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ప్రారంభమై అర్ధరాత్రి వరకు కురుస్తూనే ఉంది. అమలాపురం పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు పల్లపు ప్రాంతాలన్నీ పూర్తిగా నీట మునిగాయి. స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు అవుతున్న స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో వర్షం నీరు నిలిచిపోయి కెరటాలు కొడుతోంది. దాంతో శుక్రవారం జరిగే స్వాతంత్ర్య పరేడ్‌కు ఈ వర్షం అవరోధంగా మారింది. జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షంతో ప్రజా జీవనం స్తంభించిపోయింది. నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరంలో కురిసిన వర్షానికి తహశీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, సబ్‌ట్రెజరీతో సహా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షపునీరు చొచ్చుకు రావడంతో పూర్తిగా జలదిగ్బంధంలో ఉన్నాయి. ముమ్మిడివరంలో 18.8 సెంటీమీటర్ల వర్షపాతం కురిసి రికార్డులను నమోదు చేసింది.



అమలాపురం పట్టణం గడియారస్తంభం సెంటర్‌లో వర్షం

- మునిగిన లోతట్టు ప్రాంతాలు.. స్తంభించిన జనజీవనం
- రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు జలదిగ్బంధం
- నీట మునిగిన బాలయోగి స్టేడియం
- స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లకు అవరోధం
- రికార్డు స్థాయిలో నమోదైన వర్షపాతం
- అత్యధికంగా ముమ్మిడివరంలో 18 సె.మీ వర్షపాతం

# కుండపోత!



ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌లో..



అంబాజీపేటలో నీట మునిగిన రహదారి



స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమవుతున్న బాలయోగి స్టేడియం నీట మునిగిన దృశ్యం

## కోనసీమ అతలాకుతలం..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత మూడు నెలల నుంచి వర్షాభావ పరిస్థితులతో రైతులు, ప్రజలు అల్లాడుతుండగా, బుధవారం మధ్యాహ్నం నుంచి కుండపోతగా కురిసిన వర్షం ఒక్కసారిగా అతలాకుతలం చేసింది. వర్షాలు లేకపోవడం, రికార్డుస్థాయిలో ఎండలు మండిపోవడం వంటి పరిస్థితుల్లో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి. అయితే బుధవారం కురిసిన వర్షం వాతావరణాన్ని చల్లబడినా, కుంభవృష్టిగా కురవడంతో జనం బెంబేలెత్తిపోయారు. దాంతో అమలాపురం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో డ్రైన్లన్నీ పొంగి ప్రవహించడంతోపాటు రహదారులన్నీ రెండు అడుగులపైనే నీటితో జలదిగ్బంధంలో ఉన్నాయి. శ్రీదేవి మార్కెట్, ముస్లింవీధి, గాంధీబజార్, ముమ్మిడివరంగేట్‌తోపాటు నల్లవంతెన వద్దనున్న ఎన్టీఆర్ మార్గ్, అవతలవైపు ఉన్న ఎర్రవంతెన, నల్లవంతెన, సర్క్యులర్ బజార్, ఏజీ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్సు ఇలా అన్ని రహదారులు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతూ, లేస్తూ తమ గమ్యస్థానాలకు వెళ్లారు. సాయంత్రం 6.30 గంటలు దాటిన తరువాత కొంచెం వర్షం నెమ్మదించడంతో ఒక్కసారిగా పట్టణంలోని వీధులన్నీ వాహనాల రద్దీతో కిటకిటలాడిపోయి వంతెన కూడళ్ల వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆ సమయంలో రాకపోకలు సాగించే ప్రజలు, విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. ఇక డ్రెయిన్లన్నీ ఒక్కసారిగా పొంగడంతో రోడ్ల మీదే మురుగునీరు ప్రవహించింది. భారీ వర్షాల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సౌకర్యం నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే ఈ భారీవర్షం ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేస్తున్న అన్నదాతలకు మేలు చేకూరుస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కొన్ని పల్లపు ప్రాంతాల్లో డ్రైన్లలో నుంచి ముంపునీరు దిగే మార్గం లేకపోవడంతో సమీప పొలాలను ముంచెత్తే ప్రమాదం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు.



ముమ్మిడివరం సుంకరవారి వీధిలో...

### జలదిగ్బంధంలో బాలయోగి స్టేడియం..

భారీ వర్షంతో అమలాపురం పట్టణంలోని జీఎంసీ బాలయోగి స్టేడియం పూర్తిగా జలదిగ్బంధానికి గురైంది. ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య వేడుకలకు స్టేడియాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్న తరుణంలో వర్షం ఏర్పాట్లకు అడ్డంకిగా మారింది. స్టేడియం ప్రాంగణంలో రెండు, మూడు అడుగులపైనే నీరు నిలిచిపోవడం వల్ల ఏర్పాట్లు నిలిచిపోయాయి. ఈనేపథ్యంలో శుక్రవారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో శకటాల ప్రదర్శన, పోలీసుల కవాతుతోపాటు అధికారులు ముందస్తుగా సిద్ధంచేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



ముమ్మిడివరం తహశీల్దార్ కార్యాలయంలోకి చేరిన వర్షం నీరు

### మూడు రోజులపాటు భారీ వర్షాలు

కాగా బుధవారం నుంచి వరుసగా మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున అంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడిందని ప్రకటించింది. అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని వెల్లడించింది. దీంతో రానున్న అయిదు రోజులపాటు జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్రం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అయిదురోజులపాటు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

### కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు.. ఆలస్యంగా అప్రమత్తత

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం రాత్రి బాగా పొద్దుపోయాక కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. ఈ విషయాన్ని కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు తెలియజేస్తూ అత్యవసర సహాయం కోసం 08856 293104 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే జిల్లాలోని అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. అయితే అల్పపీడన ప్రభావంతో కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ఈ నేపథ్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ముందుగానే ఆదేశాలు జారీచేసినా ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోలేదు. మధ్యాహ్నం నుంచి అతి భారీ వర్షం పడుతున్నా రాత్రి వరకు ఎటువంటి ప్రకటనలు వెలువడలేదు. అన్ని జిల్లాలు అప్రమత్తమైనా కోనసీమ జిల్లాలో మాత్రం బాగా పొద్దుపోయేదాకా కంట్రోల్ రూమ్‌లు ప్రకటించకపోవడం గమనార్హం.



ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ ఆవరణ జలమయం

### ముమ్మిడివరంలో 18.8 సె.మీ వర్షపాతం

ఉదయం 8.30 నుంచి రాత్రి 10.30 వరకు కురిసిన వర్షపాతాన్ని చూస్తే రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ముమ్మిడివరంలో 188.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత అత్యధికంగా అల్లవరంలో 143 మి.మీ, అమలాపురంలో 132.25మి.మీ మామిడికుదురులో 130మి.మీ, అంబాజీపేటలో 128.75మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.



### సాగరతీరంలో ఎగసిపడుతున్న అలలు

అల్లవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి తీవ్ర గాలులు వీస్తూ సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఓపక్క భారీ వర్షాలు కురవడంతోపాటు అలల తీవ్రత పెరగడంతో సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం తీర గ్రామాల్లో సముద్రపు అలల తీవ్రత పెరిగి తీరం వెంబడి తుఫాను ప్రభావం కనిపిస్తోంది. సముద్రపు అలలు ఎగసి పడుతుండడంతో తీరం వెంబడి భూమి భారీగా కోతకు గురవుతోంది. అలల ఉధృతి ఇసుక తిన్నెల పైకి చేరడంతో తీరం అల్లకల్లోలంగా మారింది.




ఇన్‌స్పైర్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

### ఇన్‌స్పైర్ మానక్‌లో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో ఉండాలి : కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్ నామినేషన్‌లు సమర్పించడానికి చురుగ్గా పాల్గొని రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు పెంపొందించేందుకు రూపొందించిన ఇన్‌స్పైర్ మానక్ కార్యక్రమంలో అన్ని పాఠశాలల విద్యార్థులు నామినేషన్లు సెప్టెంబరు 15లోగా సమర్పించాలని విజ్ఞప్తిచేశారు. ఈ ఆవిష్కరణల్లో ఉత్తమ ఆవిష్కరణగా ఎంపికైన విద్యార్థులకు రూ.10వేల నగదు బహుమతిని ఇవ్వనున్నట్టు ప్రకటించారు. 3వేల నామినేషన్లు సమర్పించడం ద్వారా కోనసీమను జిల్లా రాష్ట్రస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలపగలరన్న ఆశాభావాన్ని కలెక్టర్ వ్యక్తం చేశారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావుదొర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎస్టీపీ రాఘవకుమార్

### ఉచిత బస్సు ప్రయాణం.. 15వ తేదీ సాయంత్రం నుంచి ప్రారంభం

అమలాపురం రూరల్, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని చేపట్టినట్టు జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ తెలిపారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు సీఎం చంద్రబాబు కేంద్ర కార్యాలయంలో ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తారని, అప్పటి నుంచే ఉచిత బస్సు ప్రయాణం అనుమతించడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు సదుపాయం కల్పించారన్నారు. పల్లెవెలుగు, ఆల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే ఉచిత బస్సు ప్రయాణం అనుమతించడం జరుగుతుందన్నారు.ఈ పథకాన్ని వినియోగించుకునే మహిళలు కేంద్ర, రాష్ట్రం ప్రభుత్వం జారీచేసిన ఏదైనా గుర్తింపుకార్డు చూపించాల్సి ఉంటుందన్నారు. ఉచిత బస్సు పథకం కింద జిల్లాలో 183 బస్సుల్లో 66 రూట్లలో 1288 ట్రిప్పులు అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలియజేశారు.



# కూర్చుని.. తాగండి!

### మొత్తం 455 షాపులు

తూర్పు గోదావరిలో 138, కాకినాడ జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 146 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నాయి. మొత్తంగా 452 మద్యం షాపులు 43 బార్లు ఉన్నాయి.ప్రభుత్వం బార్లకు మినహా అన్ని షాపులకూ పర్మిట్ రూంల అనుమతిస్తుంది. పర్మిట్ రూంల ద్వారా ఏడాదికి ప్రభుత్వ ఖజానాకు రూ.30 కోట్ల వరకూ జమ కానుంది. అలాగే మద్యం రాబడి పెరిగే అవకాశం ఉంది.

## మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు

- ఉమ్మడి జిల్లాలో 455 దుకాణాలు
- రూ.5 లక్షలు, రూ.7.50 లక్షల ఫీజు
- రూ.30 కోట్ల వరకూ ఆదాయం
- ప్రభుత్వం జీవో విడుదల
- మందుబాబుల ఆనందం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎక్సయిజ్ చట్టంలోని సెక్షన్ 24 (ఏ)ను అదనంగా చేర్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పలు రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత కొత్త మద్యం పాలసీని అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేటు మద్యం షాపులకు అనుమతిచ్చింది. జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లకు అడ్డుకట్ట వేసింది. దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. జగన్ జమానాలో రాష్ట్రాన్ని వదిలి పారిపోయిన కంపెనీలు మళ్లీ తిరిగొచ్చాయి.అయితే.. ఆ మేరకు ఆదాయం సమకూరకపోవడంతో పాటు మద్యం తాగే విషయంలో మందుబాబులు ఇబ్బందులు పడుతుండడం.. బహిరంగ మద్యం పానంపై విమర్శలు రావడం వంటి అంశాలపై ప్రభుత్వం నివేదికలు రప్పించుకొని విశ్లేషణ చేసింది.పర్మిట్ రూమ్‌లు లేకపోవడమే ఇబ్బం దేనిని స్పష్టమైంది.దీంతో పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.

### అనుమతి ఇలా ఇస్తారు..

మద్యం షాపుల పక్కన మద్యం తాగడానికి రూమ్‌లను అనుమతిస్తూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం. 273ను జారీ చేసింది. దరఖాస్తు చేసుకున్న మద్యం షాపులకు(ఏ4) పర్మిట్ రూమ్‌ను మంజూరు చేస్తారు. ఏడాదికి రూ.55 లక్షల్లోపు మద్యం షాపునకు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ చెల్లించే వాళ్లకు రూ.5 లక్షలు, ఆపై రూ.85 లక్షల వరకూ రూ.7.50 లక్షల వార్షిక లైసెన్సు రుసుం కింద నిర్ణయించారు. 2019కి ముందు టీడీపీ హయాంలో ఉన్న ఫీజునే ఇప్పుడూ పెట్టారు. ఈ రుసుం చెల్లించిన వారికి అనుమతి మంజూరు చేస్తారు. పర్మిట్ రూంలో వంట చేయడానికి వీల్లేదు.షాపు సమయం ప్రకారమే పర్మిట్ రూం తెరిచి ఉంచాలి. భద్రత, పరిశుభ్రత చర్యలూ తీసుకోవాలి. ఎక్సైజ్ కమిషనరేట్ నుంచి పూర్తి ఆదేశాలు రావాలని ఎక్సైజ్ అధికారులు చెప్పారు.

### తాగడానికి తిప్పలు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి వచ్చినా.. ధరలు తగ్గినా.. చుక్కేసుకోడానికి చోటుకు మందు బాబులు తిప్పలు పడేవాళ్లు. కిళ్లీ బడ్డీల దగ్గర, చాటుమాటు ప్రదేశాల్లో తాగడం జరిగేది. పోలీసులు, ఎక్సైజ్ వాళ్ల కంటబడితే జరిమానా, కేసు లేదా 'ఎంతో కొంత' వదిలేది. ప్రైవేటు మద్యం షాపులు వచ్చినా తాగడానికి పెద్ద తతంగమే ఉండేది. ఇప్పుడు పర్మిట్‌రూమ్‌లు ఇవ్వడంతో ఆ ఇబ్బందులు తప్పనున్నాయి. బార్‌లలో అదనపు ధరలు వసూలు చేస్తుండడం, పరిశుభ్రత పట్టించుకోకపోవడం వంటి కారణాలతో మద్యం షాపుల్లోనే చుక్కేసుకోవడానికి మందుబాబులు మొగ్గు చూపుతున్నారు. అయితే పర్మిట్ రూమ్‌లు లేక ఇబ్బందిగా ఉండేది. వైసీపీ ప్రభుత్వంలో బార్‌లకు లైసెన్సు ఫీజును రెండేళ్లకు జమ చేసుకొంది. వాళ్లకు ఈ ఏడాది ఆగస్టు వరకూ సమయం ఉంది. దీంతో కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చినా రాబడిలో కూడా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చినా కొత్త బార్ పాలసీలో మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నారు. అంటే ఆ మండలానికి కేటాయించిన షాపులు మండల పరిధిలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు.మండల కేంద్రాల్లో జన సంచారం ఎక్కువగా ఉంటుందని అక్కడే షాపులు పెట్టారు.కాస్త పెద్ద గ్రామాల్లో సైతం మద్యం దుకాణం అందుబాటులోకి రాలేదు.ఇది కూడా రాబడిపై ప్రతికూల ప్రభావం చూపింది. ఇప్పుడు పర్మిట్ రూంలు ఇవ్వడంతో ఆ సమస్యలు తీరనున్నాయి.పెద్ద గ్రామాల్లో మినీ మద్యం షాపులు ఏర్పాటు చేయాలని మందుబాబులు కోరుతున్నారు.



రాజోలు ఎంపీపీగా ఎంపికైన కడలి శ్రీదుర్గను సన్మానిస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం

## రాజోలు ఎంపీపీగా కడలి శ్రీదుర్గ

### అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే దేవ, ఎమ్మెల్సీ పేరాబత్తుల

రాజోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలుగా పొన్నమండ-2 ఎంపీటీసీ కడలి శ్రీదుర్గ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా పి.బొజ్జిరాజు బుధవారం ప్రకటించారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీను ఆకస్మిక మృతితో రాజోలు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుని స్థానానికి ఖాళీ ఏర్పడినందున రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎన్నికల అబ్జర్వర్ టి.నిషాంతి పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 19 ఎంపీటీసీలకుగాను టీడీపీ 7, జనసేన 5, స్వతంత్ర 2, వైసీపీ 5 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వైసీపీకి చెందిన ఎంపీటీసీలు ఎన్నికల్లో పాల్గొనకుండా గైర్హాజరయ్యారు. కోరం పూర్తి అవడంతో ఎన్నికల ప్రక్రియ ఎన్నికల అధికారి బొజ్జిరాజు ప్రారంభించారు. ఎంపీపీ అభ్యర్థిగా పొన్నమండ-2 ఎంపీటీసీ కడలి శ్రీదుర్గ ఒక్కరే నామినేషన్ వేయడంతో వైస్‌ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు బలపరిచారు. పొన్నమండ-2 ఎంపీటీసీ శ్రీదుర్గ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి బొజ్జిరాజు ప్రకటించారు. నూతన ఎంపీపీగా ఎన్నికైన శ్రీదుర్గకు నియామక పత్రాన్ని అందజేసి ఎన్నికల అధికారి బొజ్జిరాజు ప్రమాణం చేయించారు. నూతనంగా ఎన్నికైన శ్రీదుర్గను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంలకు రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ కృతజ్ఞతలు తెలిపారు. దివంగత ఎంపీపీ కేతా శ్రీను చిత్రపటానికి ఆమె పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీపీగా ఎన్నికైన శ్రీదుర్గకు గోదావరి సెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, చాగంటి స్వామి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, వైస్‌ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, మంగెన నాని, అడబాల విజయ్, మొల్లేటి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

# స్వాతంత్ర్య పోరులో మన యోధులెందరో..

\- ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరం

'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ'- 'ఏ తల్లి నినుగన్నదో ఆ తల్లినే కన్నభూమి గొప్పదిరా' అనే వాక్కులను నరనరాన జీర్ణించుకున్న ఎందరో భరతమాత ముద్దుబిడ్డలు తృణప్రాయంగా అర్పించిన ప్రాణాల ప్రతిఫలమే ఈనాటి మన ఈ స్వేచ్ఛావాయువులు. భారత జాతికి ప్రతీక అయిన మువ్వన్నెల జెండా శాంతంగా, ఠీవిగా, సగర్వంగా ఎగురుతున్న రెపరెపల్లో ఎన్నో కన్నీటి గాథలు, ప్రాణ త్యాగాలు ఇమిడివున్నాయి. తెల్లదొరల పీచమణిచి తరిమికొట్టిన స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో గోదావరి తీరం రాజమహేంద్రవరానికి చెందిన ఎందరో ప్రముఖులు జాతిని మేలుకొలపడంలో ఎనలేని ఎల్లలెరుగని కృషి చేసి 'స్వాతంత్ర్యానికి' ఊపిరి పోశారు. ఉద్యమానికి అటు రొమ్ము విరిచి, ఇటు మౌనంగా పోరాడే ఎందరో యోధులను ఈ గోదావరి తీరం అందించింది. ఆ చరిత్రను ఒక్కసారి తిరగేస్తే ఆనాటి అలుపెరగని పోరాటం మన కళ్ల ముందు కదలాడుతుంది మౌనంగా..






కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ఫ్రీడం పార్కులో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు

## గాంధీ, నేతాజీ ప్రసంగాలకు వేదిక రాజమండ్రి పాల్‌చౌక్

## గోదావరి తీరాన ఎగిసిపడిన స్వాతంత్ర్య అలలు

స్వాతంత్ర్య సమరంలో రాజమహేంద్రవరం గోదావరి జిల్లాల్లో కేంద్ర బిందువుగా ఉండేది. గాంధీజీ పర్యటనకు ఈ ప్రాంతంలో ఇక్కడ నుంచే మొదలయ్యేవి. దాంతో ఎందరో ఉద్యమకారులకు ఇది కేంద్రంగా మారింది. ఇందులో కొన్ని ప్రధాన ఘట్టాలను పరిశీలిస్తే.. 1893లో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్టణానికి రైలుమార్గం వేశారు. 1900లో హేవలాక్ బ్రిడ్జి(పాత బ్రిడ్జి) నిర్మాణం తర్వాత విజయవాడకు రైళ్లు నడిచేవి. గాంధీజీ రైలులో రాజమహేంద్రవరం వచ్చి గోదావరి స్టేషనులో దిగేవారు.

● స్వదేశీ ఉద్యమ ప్రచారానికి రాజమహేంద్రవరమే ప్రముఖ కేంద్రం. 1905 జూలైలో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వందేమాతర ఉద్యమం మొదలైంది. అదే ఏడాది ఏప్రిల్‌లో బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరం వచ్చారు. అంతకుముందే స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించే క్రమంలో నగరంలో కొందరు యువకులు బాలభారతి సమితిని ప్రారంభించారు. పాల్ ఇక్కడికి వచ్చినపుడు ఆయన వెంట ముట్నూరి కృష్ణారావు కూడా వచ్చారు. వాళ్లిద్దరూ మాదెండ్ల శౌరయ్య ఇంట్లో బస చేశారు. 1907 ఏప్రిల్ 19, 20, 21లో నగరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇప్పుడు మనం కోటిపల్లి బస్టాండ్‌గా పిలుస్తున్న ప్రాంతంలోనే పాల్ ఉత్తేజపరిచేలా ఉపన్యసించారు. అప్పట్లో ఈ ప్రాంతం విశాల మైదానంగా ఉండేది. ఇప్పుడు జెట్టీ టవర్సు ఉన్న ప్రాంతం లారీల స్టాండు. పాల్ ఉపన్యాసాలతో ప్రజల్లో దేశభక్తి ఉగ్రరూతలూగింది. క్రమేణా ఆ ప్రాంతానికి పాల్‌చౌక్‌గా పేరొచ్చింది. గాంధీజీ కూడా ఇక్కడి నుంచే జాతిని మేల్కొలిపే ప్రసంగాలు చేశారు. జాతీయోద్యమంలో భాగంగా రాజమహేంద్రవరంలో జాతీయ పాఠశాల నెలకొల్పడం కోసం రాజమండ్రి కరణం సత్యవోలు గున్నేశ్వరరావు పాల్‌కి అప్పట్లో రూ.వెయ్యి విరాళమిచ్చారు. పాల్ ఉపన్యాసాలను చిలకమర్తి లక్ష్మీనరసింహారావు తెలుగులోకి అనువదించేవారు. ఆ సందర్భంలోనే ఆయన.. "భరత ఖండంబు చక్కటి పాడియావు, హిందువులు లేగదూడలై యేడ్చుచుండ, తెల్లవారను గడసరి గొల్లవారు, పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అనే పద్యాన్ని ఆశువుగా చెప్పారు.

● 1939 సెప్టెంబరు 3న రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. అదే రోజున సుభాశ్ చంద్రబోస్ నగరానికి వచ్చారు. ఆ ఏడాది మార్చిలో త్రిపురలో జరిగిన సభలో ఆయన కాంగ్రెసు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అయితే, కాంగ్రెసులోని మితవాదవర్గం ప్రతిష్టంభన సృష్టించింది. దాంతో బోసు తన పదవికి రాజీనామా ఇచ్చారు. క్రమశిక్షణ ఉల్లంఘించాడంటూ ఆయనను మూడేళ్ల పాటు బాధ్యతాయుత స్థానాల నుంచి కాంగ్రెసు బహిష్కరించింది. అప్పుడు ఫార్వర్డు బ్లాకును ఏర్పాటుచేసిన బోసు.. ఆంధ్రదేశ పర్యటనకు ఉపక్రమించారు. దానిలో భాగంగా నగరానికి వచ్చారు. పాల్‌చౌక్‌లో గొప్ప బహిరంగ సభ జరిగింది. ఆయన ఉపన్యాసాన్ని మద్దూరు అన్నపూర్ణయ్య తెలుగులో అనువదించారు.

● గాంధీజీ, నేతాజీ వంటి దిగ్గజ నాయకులు రాజమహేంద్రవరం వస్తే దేవత శ్రీరామమూర్తి ఇంట్లో బస చేసేవారు. జాతీయ జెండాను తన ఇంటిపై ఎగురవేసుకునే హక్కు హైకోర్టులో పోరాడి గెలిచారు శ్రీరామమూర్తి.

● రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ఘటన స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రదేశ యువత చురుగ్గా పాల్గొనడానికి నాంది పలికింది. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలతో కళాశాల విద్యార్థులు ఉత్తేజితులయ్యారు. వందేమాతరం అని రాసిన ప్లకార్డులను పట్టుకొని తిరిగేవారు. వందేమాతరం పతాకాన్ని, చిహ్నాలను ధరించరాదని అప్పటి ప్రిన్సిపాల్ హంటర్ నిషేధాజ్ఞలు జారీచేశాడు. కానీ వందేమాతరం పతకాలను, చిహ్నాలను ధరించి పరీక్షలకు హాజరయ్యారు. తీసేయాలని హంటర్ చెప్పినా తీయకపోవడంతో కొందరిని సస్పెండ్ చేశాడు.

● 1920లో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించారు. రాజమండ్రిలో మహిళలు ఆ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. వీరిలో దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ ముఖ్యులు.

● శిక్షణ పొందిన స్వయంసేవకులు రాజమహేంద్రవరం నుంచే సత్యాగ్రహ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. కాకినాడ, వాడపల్లి, చెన్నైల్లో సత్యాగ్రహ శిబిరాలకు తరలివెళ్లారు. దుర్గాబాయి, దువ్వూరి సుబ్బమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ మహిళలకు, కొవ్వడి లింగరాజు పురుషుల బృందానికి నాయకత్వం వహించారు.

● 1942 ఆగస్టు 5న ముంబైలో జరిగిన కాంగ్రెసు మహాసభ క్విట్ ఇండియా తీర్మానాన్ని చేసింది. గాంధీ 'డు ఆర్ డై' అనే నినాదాన్ని ప్రకటించారు. ఈనేపథ్యంలో రాజమహేంద్రవరం గోదావరి రైల్వే స్టేషనులో డాక్టరు నాగేశ్వరరావు, కొవ్విడి లింగరాజును అరెస్టు చేసి జైలుకు తరలించారు. మునిసిపల్ పార్కులో సూరంపూడి శ్రీహరిరావు సభ నిర్వహించారు. మూడో పట్టణ పోలీసులు దాడి చేయగా వాళ్లపై ప్రజలు రాళ్ల వర్షం కురిపించారు. గోదావరి స్టేషను, మూడో పట్టణ పోలీస్ స్టేషన్లపై దాడికి వెళ్లారు. డీలక్సు సెంటరులో పోలీసులతో ఒకరకంగా యుద్ధమే జరిగింది. సాయంత్రం శద్ధానంద(లాంచీల రేవు) ఘాట్‌లో బహిరంగ సభ జరిగింది.

● స్వాతంత్ర్యోద్యమానికి దన్నుగా రాజమహేంద్రిలో ఎగిసిపడిన జ్వాలలకు మౌన సాక్ష్యం నేటి నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలోని సుబ్రహ్మణ్య మైదానం. డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగరంలో గౌతమీ సత్యాగ్రహాశ్రమాన్ని స్థాపించి.. అదే కేంద్రంగా శాసనోల్లంఘన ఉద్యమాన్ని చురుగ్గా నడిపేవారు. ఓ రోజున రాజమహేంద్రవరంలోని నాళం భీమరాజు ఇంట్లో బస చేశారు. ఈ విషయం తెలుసుకున్న రాజమండ్రి డీఎస్పీ ముస్తాఫా అలీఖాన్ నిప్పులు కక్కుతూ భీమరాజు ఇంటికి వెళ్లాడు. బయటకు పిలిచాడు. ఆయన బయటకు రాగానే లాఠీతో విరుచుకుపడి 'నీ గాంధీని ఇప్పుడు రమ్మనరా' అంటూ హేళన చేస్తూ చితకబాదాడు. మెయిన్ రోడ్డులో కొట్టుకుంటూ ఈడ్చుకెళ్లాడు. ఆ దెబ్బలతో సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడ్డారు. ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. పక్కటెముకలు విరిగిపోయాయి. క్షయ వ్యాధి పీడించింది. స్వాతంత్ర్యోద్యమం కోసం వైద్య వృత్తిని సైతం పక్కన పెట్టిన బ్రహ్మజోస్యుల అనారోగ్యంతో 1936లో అందరినీ విడిచి వెళ్లిపోయారు.





పాల్‌చౌక్..

● పాల్‌చౌక్ దగ్గర స్వాతంత్ర్య సమరయోధుల పార్కు ఏర్పాటు అయ్యింది. ఇక్కడ మహిళా సమరయోధుల విగ్రహాలను నెలకొల్పారు. గోదావరి గడ్డపై నుంచి వీరోచితంగా బ్రిటిష్ వారితో పోరాడి ఎంతో హింసను ఎదుర్కొని జైలు జీవితం గడిపిన 13 మందిలో 12 మంది చరిత్ర అతి కష్టంపై జైలు రికార్డుల ద్వారా లభ్యమైంది. దీంతో వైఎస్ నరసింహారావు వారి విగ్రహాలను నెలకొల్పారు. భారతదేశం మొత్తం మీద ఇంతమంది మహిళా సమరయోధులు జైలు జీవితం అనుభవించిన దాఖలాలు ఎక్కడా లేవని చెబుతారు. ఈ పార్కు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉండగా.. ఆంధ్ర కేసరి యువజన సమితి నిర్వహణ చూస్తోంది.

### నాడు పోలీస్ పరేడ్ గ్రౌండ్.. నేడు సుబ్రహ్మణ్య మైదానం

సుబ్రహ్మణ్య మైదానం బ్రిటీష్ పాలనలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌గా ఉండేది. స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణాలు అర్పించిన బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యాన్ని జాతి మరువరాదనే ఉద్దేశంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున అంటే 1947 ఆగస్టు 15న ఆ ప్రదేశానికి 'సుబ్రహ్మణ్య మైదానం'గా కల్నల్ డీఎస్ రాజు నామకరణం చేశారు. నగరపాలక సంస్థ కూడా నోటిఫై చేసింది. నేతాజీ అంతరంగిక వైద్యులైన రాజు.. లోక్‌సభలో రెండు పర్యాయాలు రాజమహేంద్రవరానికి ప్రాతినిధ్యం వహించారు. కేంద్రమంత్రిగా కూడా సేవలందించారు. జలగం వెంగళరావు హయాంలో ఇక్కడ పోలీస్ క్వార్టర్లు కట్టడానికి ప్రతిపాదనలు రూపొందించారు. అయితే స్వాతంత్ర్య సమరవీరుడు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం మరణానికి కారణమైన పోలీసులకు క్వార్టర్లను అక్కడ నిర్మిస్తే చరిత్ర క్షమించదంటూ వావిలాల గోపాలకృష్ణయ్య తదితరులు అడ్డుకొన్నారు. దీంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో షోకులకు పోయి చారిత్రక ఆనవాలును కాలగర్భంలో కలిపేశారు.

---

# పిఠాపురంలో నేటి నుంచి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

▸ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లకు ఎంపికైన బాలబాలికలకు ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ క్రీడా మైదానంలో శిక్షణ

పిఠాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి తూర్పు గోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురంలో 10వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ గురువారం ప్రారంభం కానుంది. పాత బస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 17వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలబాలికల జట్లు రానున్నాయి. ఇప్పటికే కొన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పిఠాపురం చేరుకోగా వారికి వసతి సౌకర్యం కల్పించారు. గురువారం సాయంత్రం నుంచి ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, బొజ్జా మాణిక్యాలరావు, కోశాధికారి కొత్తెం సుందరకుమార్ తెలిపారు.

### క్రీడాకారులకు శిక్షణ

రాష్ట్ర స్థాయి 10వ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లను ఎంపిక చేశారు. క్రీడాకారులకు పిఠాపురంలోని పాత బస్టాండు వద్ద గల బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో ఉదయం, సాయంత్రం నుంచి రాత్రి వరకు విజయమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నారు. బాల, బాలికల జట్లకు ఎంపికైన క్రీడాకారుల మధ్య పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేస్తున్నామని శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షకుడు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తెలిపారు.



ఫ్లడ్ లైట్ల వెలుగులో శిక్షణ పొందుతున్న బాలురు

**బాలికల జట్టు:**

ఎం.మానస, బి.శాలిని, పీసీ హాసిని, పి.హరిణి (జిల్లా క్రీడా మైదానం, కాకినాడ), పి.డోలాశంకరి, సీహెచ్ ఐశ్వర్య, ఎస్.రమ్య, డి.పూజిత (రామచంద్రపురం), ఎం.మౌనిక, ఎన్.చరిష్మా (అంబాజీపేట), డి.హాసిని (గొల్లలమామిడాడ), సీహెచ్ మౌనిక, ఎం.జాహ్నవి (ఏపీఎస్పీ, కాకినాడ), డి.హాసిని, ఎ.శిరీషాదేవి, ఎం.రమ్య, ఎ.కామాక్షి (అమలాపురం), ఎల్.సాగ్వి (రాజమహేంద్రవరం), సీహెచ్ మానస, ఎస్.కావ్యశ్రీ (పిఠాపురం)

**బాలుర జట్టు:**

కె.జోషిత్ నారాయణ, వి.తేజస్వరూప్, కె.హర్షిత్, హర్షతేజ, ఎ.శ్యామ్, పాలల ప్రసాద్ (రామచంద్రపరం), ఎ.జగన్, వి.హేమంత్‌కుమార్ (అమలాపురం), కె.ఠాగూర్, పి.పీయూష్, పి.దత్తు, ఎస్.నందకిషోర్ (పిఠాపురం), కృష్ణారెడ్డి, గౌతమ్ (గొల్లలమామిడాడ), సీహెచ్ ఫణీంద్ర, ఎం.సూర్య (ఏపీఎస్పీ), ఆర్.గర్విన్ (జిల్లా క్రీడా మైదానం, కాకినాడ), ఎ.భువన్‌సాయి వంశీ, ప్రవీణ్ (రాజమహేంద్రవరం), ఎస్.చాణిక్య (సామర్లకోట), పి.ప్రశాంతకుమార్ (అనపర్తి)

---

# వెండితెరపై నవ్వుల రేడు రేలంగి

▸ పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ▸ పుష్కర ఘాట్ వద్ద రేలంగి విగ్రహానికి నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ హాస్యానికి రేలంగి వెంకట్రామయ్య మకుటం లేని మహారాజు పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. హాస్య నట చక్రవర్తి, 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత రేలంగి 115వ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గల ఆయన విగ్రహానికి మంత్రి పుష్పమాల వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు తెరపై చెరగని నవ్వుల సంతకం, వెండితెరపై నవ్వుల రేడు రేలంగి అని ఆయన ప్రస్థానాన్ని మననం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు చిత్రసీమ నవ్వుల వనంలో వాడని పువ్వు హాస్య రేలంగి అని కొనియాడారు. తన ఆకారంతోను, ఆహార్యంతోను తెలుగు ప్రేక్షకులను హాస్యపు ఊయలలూగించిన హాస్య బ్రహ్మ అన్నారు. ఒకే షాట్‌లో, ముఖంలో పలు భావాలను మార్చి ప్రదర్శించడం, అందుకు అనుగుణంగా డైలాగ్‌లను టైమింగ్‌లో పలికి హాస్యం పండించడంలో ఆయనకు ఆయనే సాటిగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. కీలుగుర్రం, గుణసుందరి కథ, పాతాళభైరవి,పెద్ద మనుషులు, మాయాబజార్, మిస్సమ్మ లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించడంతో పాటు వందలాది చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి వెండి తెరను ఏలిన హాస్యపు రాజు రేలంగి అని కీర్తించారు. నాలుగు దశాబ్దాల తన సినీ ప్రయాణంలో ఎన్నో విభిన్నమైన కథలు, విలక్షణమైన పాత్రలు, విరామమెరుగని విజయాలు, రేలంగి ఖాతాలో కనిపిస్తాయన్నారు. రేయింబవళ్లు చెప్పుకున్నా, తరగని అజరామర చరిత్ర రేలంగిదన్నారు. తెలుగు సినిమా హాస్య కుటుంబ వంశవృక్షాన్ని వివరిస్తే మొట్టమొదటి స్థానం ఆయనదేనన్నారు. తనదైన నటనా వైదుష్యంతో ప్రేక్షకులను నవ్వించిన రేలంగి చిరస్మరణీయుడు అన్నారు.

గౌడ, శెట్టిబలిజ సంఘ నగర గౌరవాధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షుడు రెడ్డి రాజు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర ప్రముఖులు మార్గాని నాగేశ్వరరావు, గూడూరి రాధిక, మార్గాని సత్యనారాయణ, రెడ్డి మణి, వేమన నారాయణ, బుడ్డిగ రవి, అనుసూరి పద్మలత, కడియాల వీరబాబు, కుడుపూడి సారధి, వంక మల్లిబాబు, వీరమల్ల గోపీకృష్ణ, రాయుడు శ్రీనివాస్, కడియాల వీరభద్రరావు, గెద్దాడ శేఖర్, వియ్యపు రాఘవేంద్రయాదవ్, నరవ గోపాలకృష్ణ, వెలిగట్ల రామ్‌కిషోర్, శీలం గోవిద్, వనుము శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రేలంగి వెంకట్రామయ్య విగ్రహానికి నమస్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్

---

# 'నన్నయ' విద్యార్థులు విశ్వ పౌరులుగా ఎదగాలి

**తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్**



సభికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్. చిత్రంలో 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విశ్వ పౌరులుగా ఎదగాలని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆకాంక్షించారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ర్యాగింగ్ నిరోధక వారోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమానికి ఎస్పీ నరసింహకిషోర్, ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నన్నయ పేరుతో స్థాపితమైన ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులంతా చాలా అదృష్టవంతులని, విశ్వజనీనమైన ఆలోచనలతో ఉండాలన్నారు. యూనివర్సిటీల్లో చదివేవారు విద్య, విజ్ఞానంలో ఉన్నతంగా ఉంటారని, ర్యాగింగ్ వంటి ఆకతాయితనానికి పోయి జీవితాలను అంధకారమయం చేసుకోవద్దన్నారు. శారీరకంగా, మానసికంగా ఇతరులను బాధపెడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురిస్తుందని చెప్పారు. దుశ్చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. చదువుకునే వయసులో అపారమైన జ్ఞానాన్ని సంపాదించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. దానిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. డ్రగ్స్ తీసుకుని అనేక మంది తమ జీవితాలను పాడుచేసుకుంటున్నారని, అటువంటి వాటి జోలికిపోవద్దని సూచించారు.

ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక సంప్రదాయం కాదని, మానసిక రుగ్మతగా విద్యార్థులు గుర్తించాలన్నారు. ప్రతి విద్యార్థీ కలలు కనేందుకు సురక్షితంగా భావించే సంస్కృతి నిర్మిద్దామన్నారు. సీనియర్లు హింసించే వారిగా కాకుండా మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. వ్యక్తిత్వంతో విజయాన్ని కొలవగల ప్రదేశంగా నన్నయ విశ్వవిద్యాలయాన్ని మారుద్దామన్నారు.

అనంతరం మాదకద్రవ్య రహిత సమాజానికి కృషి చేస్తానని, ర్యాగింగ్‌కు పాల్పడనని సమావేశంలో పాల్గొన్న వారితో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్పీని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డీన్ డాక్టర్ ఎన్.ఉదయభాస్కర్, లీగల్ అధికారి నాగేంద్రరావు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు

---

## ఐసీపీ రెండో దశ కౌన్సెలింగ్‌లో 8 మందికి ప్రవేశాలు

జేఎన్టీయూకే, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ, బీటీహెచ్ స్వీడన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రాం రెండో దశ కౌన్సెలింగ్‌ను వర్సిటీలోని సెనేట్ హాల్లో బుధవారం నిర్వహించారు. మొత్తం 10 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాగా సీఎస్ఈలో ఐదుగురికి, ఏఐఎంఎల్‌లో ముగ్గురికి ప్రవేశాలు కల్పించినట్టు వర్సిటీ పీఆర్వో, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

# సీతారామసత్రం కూలగొట్టాల్సిందే

**అన్నవరంలో సత్రం నిర్మాణ పటిష్టతను పరిశీలించిన జేఎన్‌టీయూకే బృందం**



సీతారామసత్రం పటిష్టతపై పరిశీలిస్తున్న జేఎన్‌టీయూకే బృందం

అన్నవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో భక్తులకు వసతి కల్పించే పురాతననిర్మాణం సీతారామసత్రం శిథిలావస్థకు చేరిందని దీనిని కూలగొట్టాల్సిందే నని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ వి.రవీంద్ర, జి.ఏసురత్నం బృందం నిర్ధారణకు వచ్చారు. బుధవారం రత్నగిరికి విచ్చేసిన వారు ఈవో సుబ్బారావు, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ముందుగా ఆఫీస్ గదిని పరిశీలించి స్లాబ్‌పెచ్చులూడి ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు. గునపం, సుత్తి తదితర పరికరాలను ఉపయోగించి భవనం పటిష్టతను పరిశీలించగా ప్రమాదకరంగా ఉందని తేల్చిచెప్పారు. దీనిపై నివేదికను 2రోజుల్లో దేవస్థానానికి అందజేయగా తదుపరి చర్యల నిమిత్తం ఈవో సుబ్బారావు కమిషనర్‌కు నివేదించనున్నారు. ముందుగా ఈ భవనం కూల్చేందుకు టెండర్లు పిలవడం, దీనిస్థానంలో కొత్తనిర్మాణం చేపట్టేందుకు టెండర్లు ఖరారయ్యాయి. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో 2 నెలలక్రితం దేవదాయ శాఖ సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించిన సమయంలో ఈ నిర్మాణం మరో దశాబ్దంపాటు ఇబ్బందిలేదని తెలపడంతో కూల్చివేతను నిలుపుదల చేసి నూతన నిర్మాణం సత్యగిరికొండపై ఆగమ పాఠశాలకు ఎదురుగా నిర్మించాలని నిర్ణయించారు. పనులు ప్రారంభమయ్యే దశలో జేఎన్‌టీయూకే బృందం పరిశీలనతో అధికారులు డైలామాలో పడ్డారు. దీనిని కూల్చివేసినా మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మాణాలు సత్యగిరికొండపైకి మార్చాలని ప్రతిపాదనలుండగా ఏ చర్యలు తీసుకుంటారో చూడాలి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రామకృష్ణ తదితరులున్నారు.

# వామ్మో వాన..



పిఠాపురంలో కురుస్తున్న వర్షం



రాజమహేంద్రవరంలో ప్రజల పాట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుండపోతగా కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి.



ముమ్మిడివరం జీఎంసీ కాలనీలో మురుగుకాల్వను తలపిస్తున్న ఓ వీధి





ముమ్మిడివరం, కరపలో కూలిన చెట్లు



కాకినాడలో రోడ్డుపై వర్షం నీరు

## టీటీడీ టికెట్లు ఇప్పిస్తానని మోసం

**ఎమ్మెల్యే పీఏ పేరిట ఫోన్లు**

**పట్టుకున్న పోలీసులు**



పోలీసుల అదుపులో నిందితుడు

జగ్గంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) టికెట్లు ఇప్పిస్తానని మోసం చేస్తున్న వ్యక్తిని జగ్గంపేట పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం గుడిమూలం గ్రామానికి చెందిన 37 ఏళ్ల జి.రాజకుమార్ అలియాస్ ఆర్కే, అలియాస్ విజయ్ కుమార్, అలియాస్ వంశీ గోవాలో ఉంటున్నాడు. అతడిపై పలు చీటింగ్ కేసులు ఉన్నాయి. 2020 నుంచి 2024 వరకు సూర్యాపేట, తణుకు 2, విజయవాడ కృష్ణలంక, పాలకొల్లు, నర్సాపురం, ఎల్‌బీ నగర్ పీఎస్‌ల్లో చీటింగ్ కేసులు ఉన్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్, గూగుల్ సెర్చ్ ద్వారా వివరాలు సేకరించేశాడు. ప్రజాప్రతినిదుల వ్యక్తిగత సహాయకుడినని పరిచయం చేసుకుని టీటీడీ బ్రేక్ దర్శనం టికెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు ఆన్‌లైన్ ద్వారా మోసానికి పాల్పడేవాడు. ఇటీవల అతడు తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో గోల్డ్‌షాప్ యజమాని పట్నాల నాగేంద్రకి ఫోన్ చేసి తాను జగ్గంపేట ఎమ్మెల్యే పీఏ అని పరిచయం చేసుకుని దర్శనం టికెట్లు ఇప్పిస్తానని అందుకు రూ.50వేలు ఖర్చవుతుందని చెప్పాడు. దీంతో నాగేంద్ర అప్రమత్తమై ఈ సమాచారాన్ని ఎమ్మెల్యేకు తెలపగా ఆయన ఆదేశాలతో పీఏ ప్రసాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బుధవారం వంశీని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించగా పెద్దాపురం సబ్‌జైలుకు తరలించామని జగ్గంపేట పోలీసులు తెలిపారు.

# ఖరీదైన ద్విచక్ర వాహనాలే టార్గెట్

- రాజమహేంద్రవరంలో ఇద్దరు దొంగల అరెస్ట్
- రూ.19 లక్షల విలువైన సొత్తు రికవరీ
- నిందితులపై 18 కేసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్ర జ్యోతి): ఖరీదైన ద్విచక్ర వాహనాలే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను ప్రకాశం నగర్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 18 కేసులు ఉండగా వారి నుంచి రూ.19 లక్షల విలువైన 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు బుధవారం వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలపై జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. బుధవారం సీఐ బాజీలాల్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా కాకినాడ గాంధీనగర్‌కి చెందిన ఇంటి సురేంద్ర అనుమానాస్పదంగా కనిపించగా ప్రశ్నించారు. 2003 నుంచి దొంగతనాలు చేస్తున్నానని ఒప్పుకున్నాడు. అతడిపై అనకాపల్లి, రామచంద్రాపురం, కాకినాడ, పామర్రు, ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. రామచంద్రాపురం పీఎస్‌లో నమోదైన కేసులో చివరిగా 2024లో పట్టుబడి బెయిల్‌పై బయటకు వచ్చాడు. మళ్లీ దొంగతనాలు చేస్తూ స్టిక్కరింగ్ చేసే పిఠాపురానికి చెందిన కామిరెడ్డి యేసుబాబుతో కలిసి ఖరీదైన వాహనాలను చోరీలు చేశారని డీఎస్పీ తెలిపారు. వీళ్లపై ప్రకాశంనగర్ పీఎస్‌లో 7, త్రీటౌన్‌లో 2, బొమ్మూరులో 2, జగ్గంపేటలో 3, కడియం, గోకవరం, పెద్దాపురం, పిఠాపురంలలో ఒక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయయన్నారు. నిందితుల నుంచి రూ.19 లక్షల విలు వైన వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ బాజీలాల్, ఎస్ఐ సతీష్, హెచ్‌సీ నాగరాజు, క్రైమ్ పీసీలు శ్రీనివాసరావు, ప్రదీప్‌కుమార్, వీరబాబు, దుర్గాప్రసాద్, శివప్రసాద్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారని పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

# కొత్తపేట ఎమ్మెల్యే బండారుకు తృటిలో తప్పిన ప్రమాదం



ఆలమూరులో ఎడ్ల బండిపై ఎమ్మెల్యే, నాయకులు

ఆలమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో బుధవారం రైతులు నిర్వహించిన రైతు సంబరాల కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు తృటిలో భారీ ప్రమాదం తప్పింది. చొప్పెల్ల నుంచి ఆలమూరుకు చేరుకున్న ట్రాక్టర్ ర్యాలీ అనంతరం ఎడ్లబళ్లను ఏర్పాటు చేశారు. ఎడ్ల బండిపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు నాయకులు ఆకుల రామకృష్ణ, ఈదల సత్తిబాబు, చిలువూరి సతీష్‌రాజు పలువురు ఉన్నారు. అక్కడ ఏర్పడిన శబ్దానికి ఒక్కసారిగా ఎడ్ల భయపడి గంతులు చేయడంతో బండి వెనుకకు తిరగబడింది. దీంతో బండిపై ఉన్న నాయకులు ఒక్కసారిగా కిందపడ్డారు. అయితే ఎమ్మెల్యే బండారు బండికి ఉన్న కొయ్యను గట్టిగా పట్టుకోవడంతో కిందపడకుండా ఉండిపోయారు. దీంతో ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారు. సతీష్ రాజు, రామకృష్ణ, సత్తిబాబుతో పాటు పలువురికి గాయాలయ్యాయి.

### మంత్రుల పరామర్శ

కొత్తపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆలమూరులో ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావును రాష్ట్ర ఐటీ మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్, వ్యవసాయ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కె.అచ్చెన్ననాయుడు ఫోన్లో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు బండారు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# పీఎంవీబీఆర్‌వైతో అదనపు వేతనం, ఆర్థిక ప్రోత్సాహం

**ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 12 వేల కంపెనీలు నమోదు**

**ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు**



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) ద్వారా ఉద్యోగికి అదనపు వేతనంతో పాటు యజమానికి ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు క్రెడాయ్ ప్రతినిధులతో బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. తొలిసారిగా ఉద్యోగం పొందిన వ్యక్తి ఖాతాలో ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని (బేసిక్+డీఏ) కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో జమ చేస్తుందన్నారు. అలా మొత్తం గరిష్ఠంగా రూ.15 వేలను పొందవచ్చన్నారు. కనీసం ఆరు నెలల నిరంతర ఉపాధి ప్రాతిపదికన ఉద్యోగం కల్పించిన యజమానికి నెలకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకూ రెండేళ్ల పాటు ఇస్తారని ఆయన తెలిపారు.

### తప్పనిసరిగా అమలు

ఉద్యోగికి డీబీటీ విధానంలో, యజమానికి పాన్ అనుసంధాన ఖాతాల ద్వారా ఈ ప్రోత్సాహకాలు జమ అవుతాయన్నారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 వరకూ కల్పించిన ఉద్యోగాలకు పథకం వర్తిస్తుందన్నారు. రాజమండ్రి ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయ పరిధిలో ఉమ్మడి తూ ర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 12 వేల కంపెనీలు నమోదై ఉన్నాయని, అవన్నీ తప్పనిసరిగా ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుందన్నారు. నిర్మాణ రంగంలో పెద్ద సంఖ్యలో పని చేస్తు న్నారని, వారంతా పథక పరిధిలోకి వచ్చేలా క్రెడాయ్ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల పీఎఫ్ విషయంలో ఉదాశీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈపీఎఫ్‌వోలో సభ్యత్వం తీసుకుని కనీసం ఒక ఏడాది సర్వీసు పూర్తి చేసిన వారికి ప్రమాద బీమా రూ.2.50 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ లభిస్తుందన్నారు. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల సంఘాలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్లు, ఆక్వా, చేనేత కార్మిక సంఘాల తో సమావేశాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సహాయ పీఎఫ్ కమిషనర్లు య.శ్రీనివాసరావు, రాధానాథ్ పట్నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు నుంచి దేశవ్యాప్త ఉద్యమం

**వర్గీకరణపై తీర్పును సుప్రీంకోర్టు పునఃపరిశీలించాలి**

**మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్**



పిఠాపురంలో మాట్లాడుతున్న డాక్టర్ రత్నాకర్

పిఠాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సెప్టెంబరు నుంచి దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభిస్తామని రాక్స్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును 11 మంది జడ్జీలతో కూడిన ధర్మాసనంతో పునర్విచారణ జరిపించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంటులో చట్ట సవరణ చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. సమావేశంలో నాయకులు కొప్పుల ప్రేమ్‌బాబు, నెల్లి సూరిబాబు, కూసి కొండబాబు, ఎమ్ముల సత్తిబాబు, సలాది బాబులు,కాకర వెంకట్రావు పాల్గొన్నారు.

# అధికారులపై చర్యలు తీసుకోండి

- పోలవరం పునరావాస ప్యాకేజీ అమలులో నిర్లక్ష్యం
- నిర్వాసితుడి ఆత్మహత్యాయత్న ఘటనపై జాతీయ హక్కుల కమిషన్ ఆగ్రహం
- ఏపీ పునరావాస అధికారుల వైఖరిపై ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి హుకుం

రంపచోడవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పోలవరం పునరావాస ప్యాకేజీ అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న పునరావాస అధికారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జాతీయ మానవ హక్కుల కమిషన్ హుకుం జారీ చేసింది. గత సంవత్సరం మే నెలలో అల్లూరి జిల్లా దేవీపట్నానికి చెందిన పోలవరం నిర్వాసితుడొకరు తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఆంధ్రజ్యోతి తదితర పలు పత్రికల్లో వచ్చిన కథనాలపై అందిన ఫిర్యాదుపై కేసును విచారణకు స్వీకరించిన హక్కుల కమిషన్ మంగళవారం నాటి విచారణ నేపథ్యంలో సీరియస్‌గా స్పందించింది. నిర్వాసితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అనంతరం మాత్రమే ఆయనకు అందాల్సిన పునరావాస ఫైలును కదలించడం, ఇంత జరిగినా కూడా ఏడాదిగా ఆయనకు ఇవ్వాల్సిన పునరావాసాన్ని ఇవ్వకపోవడం పట్ల కమిషన్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసి పునరావాస అధికారుల తీరును ఎండగట్టింది. అంతేకాకుండా ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులను గుర్తించి చర్యలు చేపట్టాలన్న తాఖీదును కూడా ఏపీ ప్రధాన కార్యదర్శికి జారీ చేస్తూ ఆదేశించింది. వాస్తవానికి గత ప్రభుత్వంలోనే పునరావాస చర్యలను అమలు చేయడంలో నిర్లక్ష్యం జరిగింది. ప్రభుత్వం మారాక కూడా పునరావాస అధికారుల తీరు మారలేదు. దీంతో పోలవరం ప్రాజెక్టును ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేయాలనుకున్న కూటమి ప్రభుత్వ ప్రయత్నాలకు అధికారుల తీరే అప్రతిష్ఠను తెచ్చిపెడుతోందన్న ఆరోపణలున్నాయి. ఆయా అధికారులంతా ఒకే గూటి పక్షులు మాదిరిగా ఉండటంతో ఉన్నతాధికారులెవ్వరూ చర్యలు తీసుకోవడానికి చొరవ చూపడంలేదు. చివరికి జాతీయ హక్కుల కమిషన్‌తో ఏకంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే అక్షింతలు వేయించుకోవాల్సిన దుస్థితికి దారితీసింది. ఈ కేసులో ఇకపై పునరావాస అధికారులు వ్యవహరించే నిర్లక్ష్యతీరు ఇలానే కొనసాగితే హక్కుల కమిషనే చర్యలకు ఉపక్రమించి, ప్రభుత్వానికి మచ్చ వచ్చే పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## విద్యుత్‌షాక్‌తో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



ప్రశాంత్ (ఫైల్)

మండపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం జెడ్.మేడపాడు లాకుల వద్ద విద్యుత్ షాక్‌కు గురై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పసుపులేటి ప్రశాంత్ (34) బుధవారం రాత్రి మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన ప్రశాంత్ తల్లి ఇరిగేషన్‌శాఖలో లస్కర్‌గా పనిచేస్తుండగా అదేశాఖలో ప్రశాంత్ ఔట్‌సోర్సింగ్‌లో లస్కర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం లాకులో రీడింగ్ తీసిన అనంతరం ప్రశాంత్ గేదెల షెడ్డులోకి వెళ్లగా కరెంట్ స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో దాన్ని ముట్టుకున్న ప్రశాంత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటనపై మండపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'లోవ'లో డీఎఫ్‌వో పరిశీలన

తునిరూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో లోవ క్షేత్రంలో తలుపులమ్మ అమ్మవారిని బుధవారం కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో, పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం చేసి జ్ఞాపిక అందజేశారు. ఆలయంలో అభివృద్ధి పనులను పరిశీలించారు.



అభివృద్ధి పనులను వివరిస్తున్న ఈవో

## నారాయణ కళాశాలలో అగ్నిప్రమాదం

**సామగ్రి దగ్ధం**

రాజమహేంద్రవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హుకుంపేటలోని నారాయణ జూనియర్ కళాశాలలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. 5 ఫ్లోర్లు కలిగిన భవనంలో కళాశాల నడుస్తోంది. ఐదో ఫ్లోరులో హాస్టల్ ఏర్పాటు చేయడానికి మంచాలు, పరుపులు, ఫర్నీచర్ తదితర సామగ్రిని తీసుకొచ్చి సెల్లార్‌లో పెట్టారు. దీనికి ఒక వైపు దారి ఉండగా.. చుట్టూ ఐరన్ మెస్ ఉంది. గోడ పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అక్కడ ఫీజు పోవడంతో వేస్తున్న సమయంలో నిప్పులు చెలరేగి సెల్లార్‌లోని పరుపుల పై పడ్డాయి. దీంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మూడు ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని సుమారు గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఆ సమయానికి ఇంకా విద్యార్థులు కళాశాలకు రాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తినష్టంపై అంచనా వేయాలని ఫైర్ అధికారులు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

# చించినాడ వారధిపై 18, 21 తేదీల్లో పూర్తిగా ట్రాఫిక్ నిలుపుదల

**కోనసీమ కలెక్టర్ ప్రకటన**



దిండి-చించినాడ వారధి

అమలాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వశిష్ఠ నదిపై ఉభయ గోదావరి జిల్లాల మధ్య దిండి-చించినాడ మధ్య ఉన్న వారధిపై ఈ నెల 18, 21 తేదీల్లో పూర్తిగా ట్రాఫిక్‌ను నిలుపుదల చేస్తున్నట్టు కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ 2 రోజుల పాటు పూర్తిగా ఈ వారధిపై ఎటువంటి వాహనాల రాకపోకలు ఉండవని స్పష్టం చేశారు. మోటారు సైకిల్‌తో సహా ఏ ఒక్క వాహనం ప్రయాణించడానికి వీలు ఉండదన్నారు. జాతీయ రహదారి 216లో ఉన్న దిండి-చించినాడ మధ్య వారధికి సంబంధించి బేరింగ్ రిప్లేస్‌మెంట్ మరమ్మతుల దృష్ట్యా 2 రోజులు ట్రాఫిక్ నిలుపుదల అనివార్యమైనట్టు కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారి అథారిటీ అధికారుల, రోడ్డు కాంట్రాక్టరు బేరింగుల కొలతలు, స్లీవ్ స్థానాల ధ్రువీకరణ కోసం వంతెన స్పాన్‌లను ఎత్తివేయాలని ప్రతిపాదించారని, ఆ దిశగా ఈనెల 18, 21 తేదీల్లో ట్రాఫిక్ నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వాహనాల ట్రాఫిక్ మళ్లింపు విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

### ఆలయంలో జేసీ పూజలు

అంతర్వేది, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి బుధవారం విచ్చేశారు. ఆమెకు అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

### మలేరియాపై అవగాహన

అంతర్వేది, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి సలాది సత్యనారాయణ ఆధ్వర్యంలో మలేరియా దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇ.ఆదినారాయణ, పీఎల్ఎన్ స్వామి, షాలిని, ఎ.కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు**



భట్నవిల్లి జంక్షన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురంరూరల్,ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులు విడుదల చేయడంతో అన్నదాతలతో కలిసి ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు పేరూరు వై.జంక్షన్‌కు ట్రాక్టర్లపై చేరుకున్నారు. అక్కడి నుంచి వంద ట్రాక్టర్లతో ప్రారంభమైన ర్యాలీని ఎమ్మెల్యే ఆనందరావు జెండా ఊపి ప్రారంభించారు. ఆయనే స్వయంగా ట్రాక్టరు నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రైతు సంఘ నాయకుడు మట్టా మహలక్ష్మిప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్-6 హామీల్లో భాగంగా అన్నదాతలకు రూ.20వేలు చెల్లించాల్సి ఉందని, తొలివిడతగా రూ.7వేలు చొప్పున రైతుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ అన్నదాత సుఖీభవ ర్యాలీ నిర్వహించారు. వై.జంక్షన్ నుంచి హైస్కూలు సెంటర్, గడియార స్తంభం సెంటర్, ముమ్మిడివరం గేటుసెంటర్, ఎర్రవంతెన మీదుగా భట్నవిల్లి సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు ఎమ్మెల్యే ఆనందరావు పాలాభిషేకం నిర్వహించారు. ర్యాలీలో శెట్టిబలిజ, ఆర్యవైశ్య కార్పొరేషన్ల డైరెక్టర్లు కడలి వెంకటేశ్వరరావు, కంకటాల రామం, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కూటమి నాయకులు కర్రి రామస్వామి, పొలమూరి ధర్మపాల్, యాళ్ల నాగసతీష్, నల్లా శ్రీధర్, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, ఆకుల బుజ్జి, చిక్కం సుధ, ఆకుల సూర్యనారాయణ, ఇసుకపట్ల రఘుబాబు, కంకిపాటి గోపి, మోకా వెంకటసుబ్బారావుతో పాటు నాయకులు రాజులపూడి భీముడు, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, చొల్లంగి సత్యసాయిబాబా, అరిగెల నానాజీ, తిక్కిరెడ్డి నేతాజీ పాల్గొన్నారు.

### కృతజ్ఞతా ర్యాలీ

ఉప్పలగుప్తం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో బుధవారం జరిగిన అన్నదాత సుఖీభవ కృతజ్ఞతా ర్యాలీకి మండలం నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివెళ్లారు. ట్రాక్టర్లు, బైక్‌లపై కూటమి నాయకుల ఆధ్వర్యంలో రైతులు చంద్రబాబుకు జైకొడుతూ గ్రామాల మీదుగా ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో కాట్రేనికోన నీటి పంపిణీ సంఘం మాజీ చైర్మన్ అరిగెల నానాజీ, నీటి సంఘం చైర్మన్ నల్లా సత్యనారాయణ, సొసైటీ చైర్మన్లు చిక్కం ఉమేష్, ఆకేటి పెద్ద, మంచెం బాలకృష్ణ, రైతు నాయకులు చిక్కం భీముడు, అడబాల సత్యనారాయణ, నాగులపల్లి రాజు, రవణం మధు, పెయ్యల దుర్గారావు, చిక్కం దుర్గారావు, మధుర ప్రతాప్, కడలి శ్రీనివాసరావు తదితరులున్నారు. కాగా భీమనపల్లి నుంచి దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రైతులు అధికసంఖ్యలో తరలివెళ్లారు.

# భారీ వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం

- పొంగి పొర్లిన డ్రైనేజీలు
- నీట మునిగిన కొబ్బరి తోటలు





మామిడికుదురు హైస్కూలు గ్రౌండ్‌లో చేరిన వర్షం నీరు

పి.గన్నవరం: లంకలగన్నవరంలో భారీ వర్షానికి జలమయమైన కొబ్బరి తోటలు

ముమ్మిడివరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావం కారణంగా బుధవారం ముమ్మిడివరంలో మధ్యాహ్నం 3నుంచి 5.30గంటల వరకు ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో రోడ్లు, కాలనీలు వర్షం నీటితో నిండాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పలు నివాస గృహాల్లోకి సైతం వర్షం నీరు ప్రవేశించింది. ముమ్మిడివరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణ, ఆసుపత్రి వీధి, మెయిన్ రోడ్డు, పోలీసుస్టేషన్ ఆవరణ, జీఎంసీ బాలయోగి కాలనీతో పాటు పలు జగనన్న కాలనీలు, లోతట్టు ప్రాంతాలు వర్షం నీటిలో మునిగాయి. ప్రధాన పట్టణంలో డ్రైన్‌లో పూడిక తొలగించకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లు నీట మునిగాయి. దీంతో గృహస్తులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. డ్రైన్లలోని పూడికను తొలగించి ముంపు నుంచి బయటపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముమ్మిడివరం కోర్టు ఎదురుగా ఉన్న భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అలాగే మండలంలో పలు రోడ్లు, పలు ప్రాంతాలు వర్షం నీటిలో మునిగాయి. వరి పొలాల్లో వేసిన నాట్లు కూడా వర్షం నీటిలో మునిగాయి.

**మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి):** బుధవారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. 216జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులమధ్య ప్రయాణాలు చేశారు. మండలంలోని పలు కాలనీలు వర్షం నీటిలో మునిగాయి. జాతీయ రహదారితో పాటు నగరం2వవీధిలోని రోడ్డు పూర్తిగా వర్షం నీటిలో మునిగింది. మామిడికుదురు హైస్కూలు చుట్టూ వర్షం నీరు చేరింది. పలుగ్రామాల్లోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

**కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి):** మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెళ్లిళ్లు, ఇతరశుభకార్యాలకు వర్షం అడ్డంకిగా మారింది. బంధువులు, ఆహ్వానితుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. భారీ వర్షంతో ఒక్కసారిగా వాతావరణం మారడం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్యులు తెలిపారు. వర్షాలకు రైతులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివాహాది శుభకార్యాలకు వేసిన షామియానాలు తడిసి ముద్దవ్వడంతో యజమానులు, వర్కర్లు ఇక్కట్లు పడుతున్నారు.

**పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి):** బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కాస్త ఊరట నిచ్చింది. భారీవర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రెండు గంటలు కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. పాఠశాలలు విడిచే సమయం కావడంతో విద్యా ర్థులు ఇళ్లకు వెళ్లడానికి నానావస్థలు పడ్డారు. కొబ్బరితోటల్లో భారీగా వర్షం నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంతం గోదావరి వరదలను తలపించింది. డ్రైనేజీ వ్యవస్థలు లేనికాలనీలు జమయం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు.

**అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):** బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా వాతావరణం మేఘావృతమై నాలుగు గంటలు ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు, డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. పంట చేలల్లో నీరు చేరింది. కొబ్బరి తోటల్లో నీరు చేరడంతో రైతులకు మేలు జరిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా వర్షం రావడంతో ప్రయాణికులు, ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.

**ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి):** మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. ఈదురుగాలులు వీచాయి. రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు కాలనీలు నీట మునిగాయి. గొల్లవిల్లి ఎన్టీఆర్ కాలనీలో రోడ్లు మునిగిపోయాయి. భారీవర్షంతో జనం హర్షం వ్యక్తంచేశారు. పాఠశాలల నుంచి విద్యార్థులు వర్షంలో తడుస్తూ వెళ్లారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారులు, ఇతర వృత్తుల వారు ఇబ్బంది పడ్డారు. రాత్రి ఎనిమిదిన్నర గంటలకు కూడా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు.

# అమెరికాతో ఒప్పందాలను రద్దుచేయాలి



కలెక్టరేట్ ఎదుట ట్రంప్-మోదీ ఒప్పంద పత్రాలను దహనం చేస్తున్న వామపక్షాల నాయకులు

అమలాపురం టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు, కార్మికసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ట్రంప్‌తో ప్రధాని మోదీ చేసుకున్న ఒప్పందాలతో వ్యవసాయ రంగం కుదేలవుతుందని నాయకులు ధ్వజమెత్తారు. కలెక్టరేట్ ఎదుట మోదీ-ట్రంప్ వాణిజ్య ఒప్పందాల పత్రాలను దహనం చేశారు. రైతు సంఘాల జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు, కోకన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల కోసం పని చేస్తూ రైతుల నడ్డి విరుస్తుందని ధ్వజమెత్తారు. నిరసనలో నాయకులు దేవ రాజేంద్రప్రసాద్, గుదే దుర్గాప్రసాద్ పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామమూర్తి, కె.లక్ష్మణ్, దొమ్మేటి సాంబశివరావు, మట్టపర్తి సత్యప్రసాద్, కుడుపూడి సత్యనారాయణ, కామిశెట్టి నాగబాబు, గూడాల వెంకటరమణ, యిళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డుపై వరి నాట్లు



ముమ్మిడివరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పంచాయతీ పరిధిలోని మట్టాడిపాలెం రోడ్డు అధ్వానంగా మారడంతో గ్రామంలోని మహిళలు బుధవారం రోడ్డుపై వరి నాట్లువేసి నిరసన తెలిపారు. రాజుపాలెం నుంచి మట్టాడిపాలెం వెళ్లే రెండు కిలో మీటర్ల మేర రోడ్డు భారీ వాహనాలతో అధ్వాన్నంగా మారింది. దీంతో 50మీటర్ల గ్రావెల్ రోడ్డు పెద్దపెద్ద గుంతలు పడి మట్టి రోడ్డుపైకి చేరి అధ్వానంగా తయారైంది. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని వారు బుధవారం వినూత్న రీతిలో రోడ్డుపై వరి నాట్లువేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

### డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ

అమలాపురం టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏరియా ఆసుపత్రి డి అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ చేపట్టారు. జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై డ్రగ్స్‌కు బానిసలు కావడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ కె.రవితేజ, డి అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిరామ్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనుబాబు, ఆసుపత్రి డైరెక్టర్ వలవల శివరావు, లీగల్‌సెల్ పోలీసు విభాగం, జనకల్యాణ్ ప్రతినిధులు మిరియం, పరంజ్యోతి తదితర కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.

# ప్రభుత్వ స్థలాన్ని లూలూమాల్‌కు కేటాయించొద్దు



ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ నిరసనకు సంఘీభావం తెలిపిన యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

అమలాపురం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నర్ పేటలోని డిపో స్థలాన్ని అప్పనంగా లూలూ మాల్‌కు కేటాయించడాన్ని తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం ఆర్టీసీ డిపోలో కార్మికులు నిరసన తెలిపి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే జీవోలను తక్షణం రద్దు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలులో భాగంగా కొత్త బస్సులను కొనుగోలు చేయడంతో పాటు వెంటనే డ్రైవర్లు, కండక్టర్లను రిక్రూట్ చేయాలని నినాదాలు చేశారు. వేతన సవరణ జరిపి, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం విడుదల చేయాలని కోరారు. ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ఔలియా, ఉపాధ్యక్షుడు కముజు శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎంయూ నిరసనకు యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి కె.రంగప్రసాద్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

### ఎస్ఐ నూకరాజుకు సేవా పతకం



యానాం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు రాజీవ్‌గాంధీ పోలీస్ ప్రతిభా సేవా పతకానికి ఎంపికయ్యారు. పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా 27మంది సేవా పతకానికి ఎంపికయ్యారు. పుదుచ్చేరిలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో గవర్నర్ కైలాస్‌నాథన్, సీఎం నుంచి పతకం అందుకుంటారు.

# రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసనలో కాంగ్రెస్ జిల్లాశాఖ అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు

అమలాపురం టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ విధానాలను నిరసిస్తూ కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ పేరిట నిరసన తెలిపారు. కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధిని ఎత్తివేసిందని విమర్శించారు. ఎఫ్‌సీఐ వంటి గోడౌన్లను ఆదానీకి అప్పగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు రొయ్య ధరలు, పప్పు ధాన్యాల ధరలు పడిపోయాయన్నారు. ట్రాక్టర్లపై నిషేధం తొలగించాలని, కార్పొరేట్ కంపెనీలకు పంటలు పండే భూములను ఇవ్వరాదని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, కిసాన్‌సెల్ జిల్లా కోఆర్డినేటర్ దేశినీడి భాస్కరరావు, మాజీ అధ్యక్షుడు గెడ్డం సురేష్‌బాబు, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, మండలశాఖల అధ్యక్షుడు ఏలేశ్వరపు రాధాకృష్ణ, అప్పన శ్రీరామకృష్ణ, రాజోలు కోఆర్డినేటర్ సరెళ్ల ప్రసన్నకుమార్, రెడ్డి బాబు, వస్కా బాబు, బొంతు రాజేంద్రప్రసాద్, అయితాబత్తుల కుమార్‌సింగ్, నీతిపూడి బాలసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

### ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి

అమలాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా బుధవారం అమలాపురంలోని ఏరియా ఆసుపత్రిలో ఏఆర్టీగా పనిచేస్తున్న కౌన్సిలర్లకు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను గుర్తించడం, రక్త పరీక్షల నిర్వహణ అనే అంశంపై రెండురోజులు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. అదనపుడీఎంహెచ్‌వో భరతలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల నుంచి నలుగురి భాగస్వామ్యులను గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించి ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఐ.ప్రభాకరరావు, ఎయిడ్స్ టీబీఅధికారి ఆదిలింగం, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ హరినాథ్‌కుమార్, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ జాన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాలాజీ పాల్గొన్నారు.

### పగిలిన మంచినీటి పైప్‌లైన్

- కాలనీలకు నిలిచిన సరఫరా



పైప్‌లైన్ పగిలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మల్లాడి

యానాం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మెట్టకుర్రు వార్డు పరిధిలోని జీఎన్‌నాయుడు కాలనీ ప్రధాన డ్రైన్‌లో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో స్థానిక కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోయింది. డ్రైనేజీలో చెత్త తొలగించే సమయంలో మిషన్ తగిలి పైప్‌లైన్ పగిలింది. దీంతో మంచినీరు డ్రైనేజీలో కలిసిపోతుంది. దీంతో అధికారులు నీటి సరఫరాను నిలిపివేయడంతో మంగళవారం రాత్రి నుంచి సమీప కాలనీలకు మంచినీరు అదడంలేదు. పుదుచ్చేరి నుంచి యానాం వస్తున్న ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మెట్టకుర్రు వెళ్లి పైపులైన్ పరిస్థితిని పరిశీలించారు. అధికారులు, స్థానికులతో మాట్లాడారు. మరమత్తులు పనులు వేగవంత చేయాలని సూచించారు. యానాం వృద్ధాశ్రమం నుంచి ట్యాంకర్ ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని వృద్ధాశ్రమం ప్రతినిధులను మల్లాడి ఆదేశించారు. అదేవిధంగా సంఘటన ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరిశీలించి జరుగుతున్న పనులపై అధికారులతో మాట్లాడారు.

### ఆక్వా అక్రమ చెరువుల సాగుపై గ్రామస్తుల ఆందోళన

ముమ్మిడివరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలో కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా సాగు చేస్తున్నారని, దీని వల్ల తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా అక్రమ చెరువుల సాగుపై కలెక్టర్, ముమ్మిడివరం రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

### సొసైటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారాలు

మలికిపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రామరాజులంక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా వుంగరాల వెంకటబాలాజీ, సభ్యులుగా మేడిచర్ల భాస్కర్, నున్నబోయిన ఏసు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే మలికిపురం సొసైటీ చైర్‌పర్సన్‌గా జంపన సత్యనారాయణరాజు, సభ్యులుగా శిరిగినీడి త్రిమూర్తులు, గుబ్బల నరసింహస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. ఈకార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, యెనుముల వెంకటపతిరాజా, బర్రే శ్రీను, ఆకన బాబ్జినాయుడు పాల్గొన్నారు.

**మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి):** ముత్యాలపాలెం త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా సాగి వెంకటనరసింహరాజు (బాబ్జిరాజు), సభ్యులుగా నంద్యాల వెంకటతాతయ్యనాయుడు, కొల్లు సీతారాములు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీని సొసైటీ మాజీ చైర్మన్ సాగి వీఎస్ఆర్వీవీ నరసింహవర్మ(బాబు), అల్లు సురేష్ తదితరులు అభినందించారు. రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తానని చైర్మన్ అన్నారు.

**అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):** గంగలకుర్రు సొసైటీ చైర్మన్‌గా అల్లాడ సూర్యనారాయణమూర్తి(రవి), సభ్యులుగా నెల్లి వరలక్ష్మి, కాగితాపల్లి పద్మావతి, పుల్లేటికుర్రు సొసైటీ చైర్మన్‌గా దొమ్మేటి సురేష్‌కుమార్, సభ్యులుగా పెచ్చెట్టి శివసత్యహరిబాబు, గొలకోటి వీరసత్యనరేష్‌లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

### యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ముమ్మిడివరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ముమ్మిడివరం సీడీపీవో ఎం.నిహారిక సూచించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధి మహాలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రెడ్డి అనంతకుమారికి నాయకుల శుభాకాంక్షలు



పి.గన్నవరం, ఆగస్టు 13(ఆంధ్ర జ్యోతి): వెనుకబడిన తరగతుల సహ కారం ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన రెడ్డి అనంత కుమారి, రెడ్డి సుబ్రహ్మణ్యం దం పతులను కొత్తపేటలో బుధవారం కె.ముంజవరానికి చెందిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టపర్తి రామకృష్ణ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

### సొసైటీలను అభివృద్ధి దిశగా నడిపించాలి: ఎమ్మెల్యే



ఉడిమూడి సొసైటీ అధ్యక్షుడు నాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఉడిమూడి సొసైటీ చైర్మన్‌గా పెనమారెడ్డి నాయుడుతో ఎమ్మెల్యే బాధ్యతలు స్వీకరింప చేసి అనంతరం మాట్లాడారు. త్రిసభ్య కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. స్థానిక కూటమి నాయకులు నూతన కమిటీని దుశ్శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, గ్రామసర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరావు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, ఆదిమూలం సూరయ్యకాపు, తాటికాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**ముంగండ, కె.ఏనుగుపల్లి సొసైటీల చైర్మన్ల ప్రమాణ స్వీకారం**

కె.ఏనుగుపల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా బొరుసు సత్యనారాయణ, సభ్యులుగా మట్టపర్తి మణికంఠ, సాపె సత్యనారాయణ, ముంగండ సొసైటీ చైర్‌పర్సన్‌గా మట్టపర్తి వెంకటేశ్వరరావు, సభ్యులుగా యల్లమిల్లి లీలావతి, నూలు రమేష్‌లు బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీ సభ్యులను తోలేటి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, శేరు శ్రీనుబాబు, తోలేటి బంగారునాయుడు, కుంపట్ల నాయుడు, స్థానిక నాయకులు అభినందించారు.

### బి.సావరం సొసైటీ చైర్మన్‌గా కుశులుడు

రాజోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బి.సావరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్‌పర్సన్‌గా పొదలాడకు చెందిన కాండ్రేగుల కుశులుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారని సీఈవో పి.నాగరాజు తెలిపారు. ఈసందర్భంగా బి.సావరం సొసైటీ చైర్‌పర్సన్ కుశులుడు, ఇద్దరు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. కుశులుడుకు మాజీ ఏఎంసీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, పొదలాడ సర్పంచ్ కడలి సత్యనారాయణ, పోతురాజు రాధాకృష్ణ, కాండ్రేగుల కృష్ణ, పొదలాడ టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పాటి సత్యనారాయణ, లంకే వెంకటనారాయణ, మల్లాడి శ్రీను, కాండ్రేగుల పూర్ణగంగాప్రసాద్, మానుకొండ దుర్గాప్రసాద్, కాండ్రేగుల నరసింహారావు, గుబ్బల ఏడుకొండలు, కాండ్రేగుల స్వామి అభినందనలు తెలిపారు.

### పీఏసీఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారోత్సవాలు

అంతర్వేది, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామస్తులతో భారీ ర్యాలీగా వెళ్లి అంతర్వేది దేవస్థాన సొసైటీ వద్ద గొంది గ్రామానికి చెందిన రావూరి నాగు అంతర్వేది పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. అప్పనరామునిలంక రావూరి సొసైటీ చైర్మన్‌గా సూర్యనారాయణ, సఖినేటిపల్లి సొసైటీ చైర్మన్‌గా గునిశెట్టి వెర్రిబాబు ప్రమాణ స్వీకారంచేశారు. అలాగే మూడు సహకార సంఘాల సభ్యులు ప్రమాణ స్వీకారంచేశారు.

### పోలీసు కవాతు రిహార్సల్స్

యానాం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో పోలీసు కవాతు ఫైనల్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎస్పీ చింతా కోదండరామ్ నేతృత్వంలో సీఐ అడలరసన్ పుదుచ్చేరి పోలీస్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్, హోంగార్డ్స్, ఎన్‌సీసీ, వివిధ పాఠశాలల విద్యార్థులు కవాతులో పాల్గొన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్స్ నిర్వహించారు.

### అన్నదాన ట్రస్టుకు రూ.51వేలు విరాళం

ఐ.పోలవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మురమళ్లకు చెందిన గ్రంధి సత్యసూర్యసుబ్రహ్మణ్యం, సురేష్‌రాధాలక్ష్మీకుమారి దంపతులు వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.51,116 విరాళాన్ని బుధవారం ఆలయ సిబ్బందికి అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.

### డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టండి

మలికిపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జీవితంలో నిర్దేశించుకున్నలక్ష్యాలను చేరేందుకు విద్యార్థులందరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మలికిపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆనంద్‌మహానీ అన్నారు. బుధవారం సెమినార్ హాలులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్ మహమ్మారిని తరిమి కొట్టడంలో యువతదే కీలక పాత్ర అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ సత్యనారాయణ, రమేష్‌బాబు, ఆంజనేయులు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

### గణపతి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

అంబాజీపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈనెల27న ప్రారంభించే చవితి ఉత్సవాలకు సంబంధించి కొర్లపాటివారిపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న శ్రీబాలగణపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఉత్సవాల పనులు ప్రారంభించారు.

### దివ్యాంగ విద్యార్థులకు మెడికల్ క్యాంపు

అంబాజీపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల కోసం నిర్వహించే మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరించినట్టు ఆయన తెలిపారు. అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి మండలాల నుంచి 63 మంది హాజరయ్యారన్నారు. వీరికి అవసరమైన ఉపకరణాలు త్వరితగతిన అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ ఎస్‌కే బేగం, ఎం.ఆశ, సీఆర్పీలు నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

### ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ముమ్మిడివరం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.ఎస్తేరు రాణి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావుదొరకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె ఆశ వర్కర్లతో కలిసి జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి వెళ్లి ఆశవర్కర్ల సమస్యలు వివరించారు. కొన్ని పీహెచ్‌సీలు ఫోన్లు ఇచ్చినా సిమ్‌లు ఇవ్వలేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుభాషిణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ఉషారాణి, కనకదుర్గ, అన్నపూర్ణ, ఈశ్వరి, మంగాదేవి, రాజేశ్వరి, సత్యశ్రీ, స్వరూప పాల్గొన్నారు.

### 'నైట్ వాచ్‌మెన్‌లకు జీతాలు చెల్లించాలి'

ముమ్మిడివరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వఉన్నతపాఠశాలల్లో పనిచేస్తోన్న వాచ్‌మెన్లకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ డిమాండ్ చేశారు. మార్చి నెల నుంచి జీతాలు చెల్లించడం లేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, రాంబాబు, మురళీకృష్ణ, కె.సత్యం, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అల్లవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు పంచాయతీ పరిధిలో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రతీ ఇంటిపై భారతీయ జెండా ఎగురాలని ర్యాలీలో నినాదాలు చేశారు. ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, సుంకర సాయి, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముత్యాల బాబి, ఓలేటి పరమేశ్వరరావుపాల్గొన్నారు.

### రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రహదారిని కూటమి ప్రభుత్వంలో నాబార్డు నిధులతో నిర్మిస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న రహదారిని నాబార్డు నిధులు రూ.1.10కోట్లతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే నిర్మాణం చేపట్టే రహదారిని పరిశీలించారు. కొంత దూరం సీసీ రోడ్డు, మరికొంత బీటీ రోడ్డుగా నిర్మిస్తామన్నారు. కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, నైనాల ప్రభాకరరావు, కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



రైతు సంబరాల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

## రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

• ఆలమూరులో రైతుల సంబరాలు • ట్రాక్టర్ ర్యాలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రైతులకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు కృతజ్ఞతగా బుధవారం మండలంలో రైతులు భారీ ర్యాలీ జరిపి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలమూరులో జరిగిన రైతు సంబరాల సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతును రాజును చేయడానికి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు కొత్తపేట నియోజకవర్గంలో 23వేల మంది రైతులకు రూ.17కోట్లు మొదటి విడతగా రైతుల ఖాతాల్లోకి జమ చేశామని దీంతో రైతులు సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు.

**భారీ ట్రాక్టర్ ర్యాలీ:** ప్రభుత్వం రైతులకు అనేక పథకాలు అమలు చేస్తునందుకు కృతజ్ఞతగా మండల రైతులు భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. చొప్పెల్ల నుంచి నవాబుపేట, పెనికేరు, కలవచర్ల, కొత్తూరు సెంటర్ మీదుగా ఆలమూరు వరకు ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆలమూరులో జరిగిన సభలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ధాన్యంతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆకుల రామకృష్ణ, కొత్తపల్లి వెంకటలక్ష్మి, చిలువూరి సతీష్‌రాజు, పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## కిక్కిరిసిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,12,789 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

### ఆదాయం రూ.3.12 లక్షలు

**జోరువానలో మోకాళ్ల ప్రదక్షిణ:** స్వామివారి ఆలయంలో బుధవారం సాయంత్రం జోరువానలో రాజమహేంద్రవరానికి చెందిన ఒక భక్తురాలు మోకాళ్ల ప్రదక్షిణ చేశారు. ఆమె భర్త గొడుగు పట్టుకోగా ఆమె తన మోకాళ్ల ప్రదక్షిణను పూర్తి చేసి మొక్కు చెల్లించారు.

## బ్రహ్మపురి త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులతో వాసంశెట్టి సత్యం

కె.గంగవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, పదవిని బాధ్యతగా భావించి రైతులకు సేవ చేయాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. బుధవారం బ్రహ్మపురి సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా గెడ్డం పల్లపురావు (బన్నీ), సభ్యులుగా చోడి ఆదిలక్ష్మి, కూరాటి దుర్గ ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్ బన్నీ మాట్లాడుతూ బ్రహ్మపురి సొసైటీని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అక్కల రిష్వంత్ రాయ్, కూటమి నాయకులు చిర్రా రాజ్ కుమార్, మేడిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. ఏఐఎస్ఎఫ్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు వెంకట ఆధ్వర్యంలో విద్యార్థులు రావులపాలెం నుంచి రామచంద్రపురం వరకు బైకులపై ర్యాలీగా వచ్చారు. స్థానిక చెలికాని రామారావు స్మారక భవనం వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు ఏఐఎస్ఎఫ్ పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఏఐటీయూసీ నాయకుడు రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాలరావు

## తూర్పులో విలీనం చేయాలంటూ తీర్మానం



మాట్లాడుతున్న ఎంపీడీవో కీర్తి స్పందన

రాయవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని కోరుతూ మండల ప్రజా పరిషత్ అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో ఉన్న మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపడం వల్ల ప్రతి ఒక్కరికీ సౌలభ్యంగా ఉంటుందన్నారు. ప్రజల అభీష్టాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ద్వారా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు నిర్ణయించారు. సమావేశంలో తహశీల్దారు ఐవీ శెట్టి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

కపిలేశ్వరపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి కోరారు. బుధవారం అంగర సిద్ధార్థ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఎస్ఐ హరీష్‌కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికిపోయి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వాకా పరమేశ్వరరావు, చైర్మన్ శేఖర్, కరస్పాండెంట్ రాజా, ప్రిన్సిపాల్ రమణ, కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అంగర సిద్ధార్థ కళాశాలలో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

### నేడు పోలేరమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

రాయవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): చెల్లూరులోని పోలేరమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ తెలిపారు. బుధవారం చెల్లూరులో వక్తలు మాట్లాడుతూ 14న తెల్లవారుజామున అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తామన్నారు.



కపిలేశ్వరపురంలో వర్షంతో నిండిపోయిన బ్యాంక్ వీధి



కొత్తపేటలో భారీ వర్షానికి కమ్మిరెడ్డిపాలెం సెంటర్లో నీటమునిగిన రోడ్డు



రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడులో నీటి మునిగిన పంట పొలాలు

## ఒక్కసారిగా దంచికొట్టింది

కొన్ని రోజులుగా సరైన వర్షాలు లేక రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో ఉక్కపోతతో అల్లాడారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా బుధవారం సాయంత్రం కుండపోతగా వర్షం పడింది. దీంతో ఆయా మండలాల్లో కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం కాగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

కపిలేశ్వరపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆయా ప్రాంత రహదారులపై వర్షపు నీరు చేరడంతో డ్రైన్లు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడంతో పాటు, జనవాసాల మధ్య నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులపడ్డారు.

**ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా గురువారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోని పలు గృహాలు జలమయమయ్యాయి. వాడపల్లి లొల్ల సైఫాన్ నిర్మించిన ప్రాంతంలో వరిపొలాలు జలమయమయ్యాయి.

**రావులపాలెం, (ఆంధ్రజ్యోతి):** మండలంలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో మురుగు డ్రైన్లు పొంగి ప్రవహించడంతో పంట పొలాల్లోకి ముంపునీరు చేరి ముంచెత్తింది. మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ముంపులో చిక్కుకుంది. తహశీల్దారు కార్యాలయం రోడ్డుతో పాటు పలు రహదారులు జలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

### లోతట్టు ప్రాంతాలు జలమయం

**కొత్తపేట, (ఆంధ్రజ్యోతి):** అల్పపీడన ప్రభావంతో బుధవారం సాయంత్రం ఎడతెరిపిలేని వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లోని రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం సెంటర్ నుంచి వాడపాలెం వెళ్లే రోడ్డు వర్షపు నీటితో ముంపునకు గురైంది. గణేష్‌నగర్ మార్కెట్ ఏరియా, మండలంలోని ఆయా పల్లపు ప్రాంతాలతో పాటు జూనియర్ కళాశాల ప్రాంగణం వర్షం నీటితో మునిగిపోయాయి.

**మండపేట, (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన బారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. వర్షం కారణంగా పలు రహదారులపై నీరు నిలిచిపోవటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మండపేటలో వర్షం పడుతున్న దృశ్యం

### నేడు కేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

మండపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జెడ్.మేడపాడు గ్రామంలోని కేశవస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో స్థానికులంతా విరాళాలు వేసుకుని ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నామని గ్రామస్తులు, నిర్వాహకులు తెలిపారు. తొలుత రూ.60 లక్షల అంచనాతో వీటి పనులు చేపడుతున్నామని వారు తెలిపారు. కేశవస్వామి ఆలయంతోపాటు, శివాలయాన్ని కూడా నిర్మిస్తున్నామని వారన్నారు. గురువారం ఉదయం జరిగే ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరవుతారని సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

### చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

మండపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచడంతోపాటు, మెటర్నిటీ సెలవులు 180 రోజులు, గ్రాట్యుటీ 150000 ఇవ్వటం పట్ల ఆశవర్కర్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై బుధవారం వారంతా ఏడిదలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఆశవర్కర్లు, కూటమి నేతలతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమినేతలు పర్వతిన వీర్రాజు, మండల వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



మల్లవరంలో ప్రతిష్ఠ జరిపిన ఆంజనేయస్వామి విగ్రహం

### ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల శివారు మల్లవరంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా రెండు రోజులుగా పూజలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.



### ఘనంగా విజయకనక దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాచర గ్రామపంచాయతీ శివారు శ్రీరామపురం ఏటిగట్టుపై ఉన్న విజయకనక దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం జరిగింది. వేదపండితుడు పెదపూడి సీతారామచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు, కుంకుమపూజలను వేదమంత్రోశ్చరణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలి



రాయవరం మండలం లొల్లలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాయవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహించాలని ప్రధాని మోదీ పిలుపుమేరకు బుధవారం లొల్ల గ్రామంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, చాట్రాతి జానకి రాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి హాజరై మాట్లాడారు. తొలుత జాతీయ జెండాలను చేతబట్టి రాయవరం సాయితేజా విద్యార్థులతో కలిసి గ్రామంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు తదితరులతో పాటు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మండపేట, (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పార్టీ శ్రేణులు జాతీయ జెండాలతో ర్యాలీ జరిపారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వద్దనుంచి మండపేటకు చెందిన అదిత్య కళాశాల విద్యార్థులతో బీజేపీ నేతలు ర్యాలీ జరిపారు.ర్యాలీలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాయిరాం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, మురళీకృష్ణ, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి):** కపిలేశ్వరపురంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలు చేతపట్టుకుని దేశభక్తి నినాదాలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని అలవరచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. బుధవారం రామచంద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో హర్‌ఘర్ తిరంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ తో పాటు సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రామచంద్రపురం మండల శాఖ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, బీజేపీ ఐటీ విభాగం జిల్లా కన్వీనర్ బీవీఆర్ చౌదరి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**రావులపాలెం, (ఆంధ్రజ్యోతి):** రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు హరఘర్ తిరంగ ర్యాలీ చేపట్టారు. బుధవారం కళాశాల ప్రాంగణం నుంచి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకున్నారు. జాతీయ రహదారి ముఖ్య కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, అధ్యాపకులు రమేష్‌బాబు, కె.రజని సుమలత తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో హర్‌ఘర్ తిరంగాను పురస్కరించుకుని విద్యార్థుల మానవహారం

## స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలంటూ ధర్నా



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అంగర గాంధీ సెంటర్‌లో బుధవారం స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిపారు. స్మార్ట్ మీటర్లు రద్దుతో పాటు విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ మెయిన్ రోడ్డులో రాస్తారోకో చేశారు. రాస్తారోకోను ఉద్దేశించి భారత కార్మిక సంఘాల సమాఖ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూల నాయకులు చింతా రాజారెడ్డి, మద్దిరెడ్డి వెంకటరాజు, నున్న రమేష్, కె.నాగేశ్వరరావు, వి.సుబ్బారావు, బి.కాశీ, డి.దుర్గారావు, గుత్తుల దుర్గారావు, రైసుమిల్లు జట్టు కార్మికులు పాల్గొన్నారు.

## అనంతకుమారికి ఎమ్మెల్సీ అభినందన

కొత్తపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన రెడ్డి అనంతకుమారిని బుధవారం ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పొలిట్‌బ్యూరో సభ్యుడు మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, అనంతకుమారి దంపతులను ఆయన దుశ్శాలువాతో సత్కరించారు.



రెడ్డి అనంతకుమారి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖర్

### సతీష్‌రాజును పరామర్శించిన ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరులో జరిగిన రైతు సంబరాల్లో ఎమ్మెల్యే బండారుకు స్వల్ప గాయాలు కాగా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజుకు కాలికి ఫ్యాక్చర్ అయ్యింది. దీంతో అతన్ని వెంటనే రావులపాలెంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎమ్మెల్యే బండారుతో పాటు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ ఆసుపత్రికి చేరుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

### జాబ్‌మేళాలో 60 మంది ఉద్యోగాలకు ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతివారం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో 60 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం నియామక పత్రాలు అందచేశారు.

### ఇరవై రోజుల్లోగా డీఏపీ వేయాలి

కె.గంగవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వరి పొలం ఇనమారు దశలోనైనా, లేక నాట్లు వేసిన 20 రోజుల్లోగా డీఏపీ ఎరువును వేయడం వల్ల మొక్కల ఎదుగుదల బాగుంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఏ. సద్గురుమూర్తి అన్నారు. బుధవారం సత్యవాడ, పాణింగపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాణింగపల్లి సొసైటీ అధ్యక్షుడు బలుసు ప్రసాద్, వీఏఏ సాయిప్రియ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వెదురుపాక శ్రీకృష్ణుడు

### కృష్ణాష్టమి వేడుకలకు శ్రీకారం

రాయవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గీతా మందిరం వద్ద కృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు శ్రీకారం చుట్టినట్లు గీతా మందిరం నిర్వాహకుడు ఆధ్యాత్మికవేత్త సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వెదురుపాక గ్రామంలో ఆయన మాట్లాడుతూ 16న తెల్లవారుజామున స్వామివారికి మేల్కొపు సేవ, స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామార్చన, భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ, ఏకాహ భజనలు నిర్వహిస్తామన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి పల్లకీసేవ, చిన్నారులతో రాధాకృష్ణ వేషధారణలో ప్రదర్శనలు, రాత్రి ఉట్టి ఉత్సవం, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గీతా మందిరం వద్ద ఇప్పటికే పలువురు భక్తులు శ్రీకృష్ణ మాలలు ధరించి దీక్షలు చేపట్టారన్నారు. ఈ వేడుకల్లో వెదురుపాక పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాగులాపల్లి వీరవెంకట సత్యనారాయణ, పడాల శివమణికంఠరెడ్డి భక్తులు పాల్గొన్నారు.